https://teluguislam.net



# అధ్యాయం–10

## 190–218

## 10–సుగుణవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు

- కోపాన్ని దిగమింగేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- సహనమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు.
- పేదవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- సత్యవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు.
- న్యాయమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు.
- భయంభక్తిగా జీవించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- పరిశుద్ధులను అల్లాహ్ ప్రేమిస్తాడు.
- తుమ్ముల కారణంగా ప్రేమింపబడతారు.
- బిడియం స్వర్గానికి మార్గం.

https://teluguislam.net



# 10-సుగుణవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు

సమాజంలో ప్రేమాభిమానాలతో అనునిత్యం కళకళలాడాలంటే ప్రతి ఒక్కరు ధర్మజ్ఞానాన్ని పట్టుదలగా నేర్చుకోవాలి. మరియు దానిని మొత్తం సమాజంలో విస్తరింపజెయ్యాలి. అంతటి గొప్ప కార్యం చేపట్టాలంటే మనిషి జ్ఞానంతో పాటు, సద్గుణాలు కలిగి ఆదర్శమూర్తిగా నిలబడాలి. అలా చేసిన నాడు సమాజం సత్సమాజంగా అలరారుతుంది. పరలోకంలో అల్లాహ్ ప్రీతి కూడా పొందగలరు.

హజ్రత్ అబూ సాలబా అల్ ఖషని (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ దగ్గర అందరికంటే ఎక్కువగా ప్రియతములు మరియు నాకు అందరికన్నా (ప్రళయదినాన) ఎక్కువగా దగ్గరగా ఉండేవారు సుగుణవంతులు. మరియు అల్లాహ్ దగ్గర అందరికన్నా ఎక్కువగా అయిష్టులు మరియు నాకు అందరికన్నా ఎక్కువగా దూరంగా ఉండేవారు వదరుబోతులు, డాబుసరిగా మాట్లాడేవారు, వికటంగా నవ్వుతూ మాట్లాడేవారు'' అని అన్నారు.[1]

హజ్రత్ ఉసామా బిన్ షురైక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర మనం ఎంతో నిశబ్దంగా, అంటే మన తలపై పక్షులు వాలి ఉన్నాయా అన్నంత ఏకాగ్రతతో ఎవ్వరితో మాట్లాడకుండా కూర్చొని ఉంటిమి.

---

[1] (సహీహ్ ఇబ్ను హిబ్బాన్: 483).

https://teluguislam.net



అంతలో కొంత మంది ప్రజలు వచ్చి: 'అల్లాహ్ దగ్గర అందరికంటే ఎక్కువగా ప్రియతములు ఎవరు?' అని అడిగారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) : 'మీలో అందరికంటే ఉత్తమ గుణవంతులు' అని అన్నారు. [1]

ఇస్లాంలో లేదా దివ్య ఖుర్‌ఆన్‌లో ఏ ఉత్తమ ఆదర్శాల గురించి అల్లాహ్ మానవుల కొరకు ప్రత్యేకించాడో, వాటిని పాటించువారే అల్లాహ్ దగ్గర అతి ప్రియమ్మైన దాసులు. ఒక సారి హ్రజత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) గారిని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గుణాల గురించి ప్రశ్నించగా, **'ఆయన గారి గుణగణాలు ఖుర్‌ఆన్‌కు దర్పణం వంటివి'** అని సమాధానమిచ్చారామె. [2]

ప్రపంచమానవులందరిలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సంపూర్ణమ్మైన సుగుణవంతులు. ఆయన సంస్కారం, మర్యాద మృదుతర్వ్, వాత్సల్యం, నిజాయితీ సచ్ఛీలత, సౌమ్యం, దాతృత్యం, ప్రేమా, జాలి వంటి ఉన్నతమ్మైన సుగుణాల శిఖరానికి ఆయన చేరుకొని యుంటిరి. అందుకని అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి వ్యక్తిత్వాన్ని ఇలా వర్ణించాడు: **''ఇంకా నీవు నైతికంగా అత్యున్నత స్థానంలో ఉన్నావు.''** [3]

మరియు హ్రజత్ అనస్ (రజియల్లాహు అన్హు) గారు కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''మానవులందరిలోకెల్లా సుగుణవంతులు.'' అని తెలియజేశారు. [4]

---

[1] (తబ్రానీ, హైసమ్, సిల్‌సిలతుస్ సహీహా: 432).

[2] (అహ్మద్:23460).

[3] (సూరతుల్ ఖలమ్:4).

[4] (బుఖారీ:5735, ముస్లిం:1054).

https://teluguislam.net



హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హ) గారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఓదార్చేందుకు ఆయన గుణాలను ఈ విధంగా కొనియాడారు: “ కానేకాదు, అల్లాహ్ సాక్షిగా! చెబుతున్నాను: “అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని వృధా చేయడు. ఎందుకంటే మీరు బంధువుల హక్కు చెల్లిస్తారు. రుణగ్రస్తులకు విముక్తి నిస్తారు. పేదవారికి సహాయం చేస్తారు. అభాగ్య జీవులను ఆదుకుంటారు. అతిథులకు మర్యాద చేస్తారు. సత్యాన్ని బలపరుస్తారు. ఆపదల్లో ఉన్నవారికి ఆపద్బాంధవుల్లా తోడ్పడతారు.”[1]

మరియు హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) గారు ఇలా తెలియజేశారు: “మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎవ్వరిని దూషించేవారు కారు. అపకారం చేసిన వారికి అపకారం చేసేవారు కారు. పైగా మన్నింపుల వైఖరిని అవలంభించేవారు. ఏదేని విషయంలో ఆయనకు స్వేచ్ఛ ఇవ్వబడితే సరళ విధానాన్ని అవలంభించడానికే ఇష్టపడేవారు. అయితే ఏదైన విషయంలోని ఉచితానుచితాలను, ధర్మా ధర్మాలను పరికించి ధర్మ సమ్మతమైన దానిని మాత్రమే ఎన్నుకునేవారు. స్వవిషయంలో ఆయన ఎన్నడూ ఎవరిపై ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే దైవాజ్ఞలను ధిక్కరించిన వారికి దైవ శాసనానుసారం శిక్ష విధించేవారు.” [2]

మూడు విషయాలను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన దరికి చేరనీయలేదు:

**ఒకటి:** ‘వాదులాట.’

---

[1] (బుఖారీ:3, ముస్లిం:231).

[2] (బుఖారీ).

https://teluguislam.net



**రెండు;** 'అవసరానికి మించి మాట్లాడటం.'

**మూడు;** 'తనకు అక్కరలేని విషయాల్లో తల దూర్చటం.'

మరియు ఇతర విషయాల్లో కూడా మూడు విషయాలకు దూరంగా ఉండేవారు.

**ఒకటి;** 'ఒకరికి చెడు అనేవారు కారు.'

**రెండు;** 'ఒకరి తప్పులెంచేవారు కారు.'

**మూడు;** 'కూపీలు లాగటానికి తాపత్రయ పడేవారు కారు.'[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రజల్ని అతి ఎక్కువగా స్వర్గానికి గొనిపోయే కర్మలు ఏవని? ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అడగడం జరిగింది.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **'దైవభీతి, ఉత్తమ నడవడికలు'** అని సమాధానమిచ్చారు.

మరియు ప్రజలను అతి ఎక్కువగా నరకానికి గొనిపోయే కర్మలు ఏవని? అడగారు.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **'నోరు మరియు మర్మాంగం'** అని అన్నారు.[2]

మరొక హదీసులో ఇలా ఉంది: ''ఉత్తమ నడవడికను కలిగి ఉన్న వ్యక్తికి స్వర్గంలో ఎత్తయిన ప్రదేశంలో ఒక గృహాన్ని ఇప్పించేందుకు నేను పూచీ వహిస్తున్నాను.''[3]

---

[1] (హృదయాల విజేత ముహమ్మద్ (స)పేజి: 11-13, షమాయిల్ తిర్మీదీ:346).

[2] ( సహీహ్ తిర్మిజీ: 2004).

[3] (సహీహ్ అబూదావూద్: 4800).

https://teluguislam.net



హజ్రత్ అబూ దర్దా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రళయ దినాన విశ్వాసి **త్రాసులో ఉత్తమ నడవడికకన్నా బరువైన వస్తువు మరొకటి ఉండదు...**''[1]

హజ్రత్ అబూ హురైరా, అబ్దుర్రహ్మాన్ బిన్ సఖర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మీ శరీరాలను, మీ ముఖాలను చూడడు. కాని ఆయన **మీ అంతరంగాలను, ఆచరణలను** చూస్తాడు...'' [2]

అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''పుణ్యకార్యాలు చేసేవారు పురుషులైనా స్త్రీలైనా– వారు గనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు.'' [3]

దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ప్రపంచం సమస్తం జీవన సామగ్రి. ఈ ప్రపంచ సామగ్రిలో అన్నిటికంటే ఉత్తమమ్మైన వస్తువు మంచి (సద్గుణాలు కలిగిన) స్త్రీ.'' [4]

## కోపాన్ని దిగమింగేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారు కలిమిలో లేమిలో ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు. కోపాన్ని దిగమ్రింగేవారు. ఇతరుల తప్పులను క్షమించేవారు. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం''[5]

---

[1] (సహీహ్ తిర్మిజీ:2002, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్: 2641).

[2] (ముస్లిం:4650).

[3] (4,సూరతున్ నిసా: 124).

[4] (ముస్లిం:2668).

[5] (3,సూరతు ఆలి ఇమ్రాన్: 134).

https://teluguislam.net



హజ్రత్ ముఆజ్ బిన్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరికైతే కోపం వస్తుందో, దాన్ని చూపించే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికి తమ కోపాన్ని దిగమింగేస్తే, ప్రళయ దినాన అల్లాహ్ సర్వ సృష్టిరాసులందరి సమక్షంలో వారిని పిలిచి: ''నీకు ఇష్టమైన స్వర్గకన్యను ఎన్నుకోమని'' అంటాడు.[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కుస్తీపట్టి ఇతరులను చిత్తుచేసే వాడు ఘనుడు కాడు. కాని కోపం వచ్చినప్పుడు తన్ను తాను అదుపులో పెట్టుకోగలిగినవాడే నిజమైన ఘనుడు.''[2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) కథనం ప్రకారం; కొంత మంది యూదులు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఇంటికి వచ్చి **''అస్సాము అలైకుమ్''** (మీకు చావు రావాలి) అని చెప్పారు.

ఇది వింటున్న ఆయన ధర్మ పత్ని ఆయిషా (రజియల్లాహు అన్హ) (ఆగ్రహంతో) వెంటనే: **'వాలైకుముస్ సాము వల్ లానతు'** (మీకు చావు రావాలి మరియు మీపై శాపం పడాలి) అని అన్నారు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను వారిస్తూ: 'ఆయిషా! **'వదిలేయి' మృదువుగా అవలంభించు. అల్లాహ్ ప్రతి విషయంలోనూ మృదుత్వాన్నే ఇష్టపడుతాడు'** అని అన్నారు.

యా రసూలల్లాహ్! మీరు వినడం లేదా? వారు ఏమంటున్నారు.

సరే నేను కూడా వారికి జవాబుగా **''వాలైకుమ్''** అన్నాను కదా.[3]

---

[1] (సహీహ్ తిర్మిజీ:2021, సహీహ్ ఇబ్ను మాజా:4186).

[2] (బుఖారీ:5649, ముస్లిం:4723).

[3] (బుఖారీ: 5565).

https://teluguislam.net



## సహనమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మరియు అల్లాహ్ సహనం వహించేవారిని ప్రేమిస్తాడు.’’ [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరయితే మా మార్గంలో బాధలు భరిస్తారో, వారికి మేము తప్పకుండా మా ‘మార్గాలు’ చూపుతాము. నిశ్చయంగా అల్లాహ్ సద్వర్తనులకు తోడుగా ఉంటాడు.’’ [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘సహనం వహించేవారికి లెక్కలేనంత పుణ్యఫలం ప్రసాదించబడుతుంది.’’ [3]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.’’ [4]

మరోకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మేము ఏదో ఒక విధంగా మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తూ ఉంటాము – భయంతో, ఆకలిదప్పులతో, ధనప్రాణాల నష్టంతో, పండ్లకొరతతో (పరీక్షిస్తాము)! ఈ సహనమూర్తులకు శుభవార్త ఇవ్వండి.’’ [5]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘మరణం పొందాలని ఆశించకండి. ఒక వేళ మీరు పుణ్యాత్ములుగా ఉంటే

[1] (ఆల ఇమ్రాన్:146).
[2] (సూరతు ఆన్‌కబూత్: 69).
[3] (సూరతుజ్ జుమర్:10).
[4] (సూరతల్ బఖరా:153).
[5] (సూరతుల్ బఖరా: 155).

https://teluguislam.net



మరింత అధికంగా పుణ్యకార్యాలు చేయవచ్చు. ఒక వేళ పాపాత్ములుగా ఉంటే పశ్చాతాపం చెంది అల్లాహ్ వద్ద క్షమాపణ కోరి ప్రేమను పొందవచ్చు.'' [1]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ, అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ముస్లింకు ఏ విధమైన ఆపద వచ్చినా, బాధ కలిగినా, ఆందోళన కలిగినా, దుఃఖం కలిగినా, చివరికి ముల్లు గుచ్చుకున్నా సరే దాన్ని అల్లాహ్ అతనికై పాప పరిహారంగా చేస్తాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నువ్వు సహనంతో మసులుకో. నిశ్చయంగా సద్వర్తనుల పుణ్యఫలాన్ని అల్లాహ్ వృథా కానివ్వడు.'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరికైతే అల్లాహ్ మేలు చెయ్యాలనుకుంటాడో అతనికి బాధలతో పరిక్షిస్తాడు.'' [4]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఇలాంటివారికే వారి సహన స్థయిర్యాలకు బదులుగా స్వర్గంలోని అత్యున్నత స్థానాలు వొసగబడతాయి. అక్కడ సలాం, దీవెనెలతో వారికి స్వాగత సత్కారాలు లభిస్తాయి.'' [5]

---

[1] (బుఖారీ:5241).

[2] (బుఖారీ:5215, ముస్లిం:4670).

[3] (సూరతు హూద్: 115).

[4] (బుఖారీ:5213).

[5] (సూరతుల్ ఫుర్ఖాన్: 75).

https://teluguislam.net



హజ్రత్ అబూసయీద్ సాద్ బిన్ మాలిక్ బిన్ సినాన్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం: కొంత మంది అన్సారులు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను యాచించారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారడిగింది ఇచ్చారు.

వాళ్ళు: 'మళ్ళీ మళ్ళీ యాచించారు.' అప్పుడు కూడా ఆయన వారికి ఇచ్చారు.

చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర ఉన్నదంతా అయిపోయింది.

ఉన్నదంతా అయిపోయిన తరువాత ఆయన వారితో: **'నా వద్దకు ఏ కొంత ధనం వచ్చినా నేను దాన్ని నిల్వచేసి ఉంచుకోను.' అని:**

- ఎవడైతే యాచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాడో అల్లాహ్ అతన్ని కాపాడుతాడు.
- నిరపేక్షభావం అవలపరచుకోవాలనుకున్న వ్యక్తిని అల్లాహ్ నిరపేక్షాపరునిగా చేస్తాడు.
- సహనం కోరే వ్యక్తికి అల్లాహ్ సహనం వహించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు.

**''మనిషికి ఇవ్వబడిన కానుకల్లో ఓర్పును మించిన మేలైన, విశాలమైన కానుక మరొకటి లేదు.''** అని అన్నారు.[1]

హజ్రత్ అబూ యహ్యా సుహైబ్ బిన్ సినాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (బుఖారీ:1376, ముస్లిం:1745).

https://teluguislam.net



విశ్వాసి వ్యవహారం చాలా విచిత్రంగా ఉంటుంది. అతను చేసే ప్రతి పనిలో అతని కొరకు మేలు ఉంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈ భాగ్యం ప్రాప్తించలేదు.

- అతనికి ఆనంద ఘడియలు ఎదురైతే అందుకు అతను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (దాని కారణంగా అతనికి పుణ్యం లభిస్తుంది)
- ఒక వేళ అతనికి కష్టాలు ఎదురైతే అతను సహనం వహిస్తాడు, ఈ సహనం కూడా అతనికి మేలే కలుగజేస్తుంది. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కాలం సాక్షిగా! నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు– అయితే విశ్వసించి సత్కార్యాలు చేసిన వారు, పరస్పరం సత్యం గురించి ఉపదేశించినవారు, ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసినవారు మాత్రం నష్టపోరు'' [2]

**ఇంతకీ సహనం (ఓర్పు, నిగ్రహం) దేనిపై?**

అంటే – కష్టాలపై! దైవశాసనాల ప్రకారం జీవితం గడిపే సమయంలో ఎదురయ్యే పరీక్షలపై! పాపకార్యాలు, నీతిబాహ్యమైన విషయాలు ఎదురుపడినప్పుడు! మనోవాంఛలను త్యాగం చేయవలసి వచ్చినప్పుడు!

ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఓపిక పట్టి, సత్యధర్మంపై స్థిరత్వం కనబరచాలి. ఇది నిజంగా సాహసోపేతమైన విజయమే.

---

[1] (ముస్లిం:5318).

[2] (సూరతుల్ అస్ర్).

https://teluguislam.net



**‘సహనం’** కూడా సత్యంలో ఇమిడి ఉన్న విషయమే అయినప్పటికీ ఈ సూరాలో దీన్ని ప్రత్యేకంగా విడదీసి చెప్పటం జరిగింది. దీన్నిబట్టి ధర్మావలంబనలో **‘సహనానికి’** గల ప్రాముఖ్యత ఎంతటిదో అవగతం అవుతోంది. [1]

ఒకసారి ఒక నల్లటి మహిళ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి:

‘‘నాకు మూర్ఛరోగం వస్తూ ఉంటుంది. అప్పుడు నా ఒంటి మీద బట్టలు కూడా తొలిగిపోతాయి. అందుచేత నాకోసం అల్లాహ్‌ను ప్రార్థించండి’’ అని మనవి చేసుకున్నది.

దానికి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం):

‘‘నీవు తలిస్తే (ఈ బాధపట్ల) సహనం వహించవచ్చు. ఆ సహనానికి బదులుగా నీకు స్వర్గం లభిస్తుంది’’

‘‘ఇక నీవు కోరినట్లయితే నేను నీ కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తాను నీ బాధ దూరం కావాలని’’ అని అన్నారు.

దానికామె: ‘‘సరే నేను సహనం వహిస్తాను’’ అని అన్నది.

ఆ తరువాత కాస్సేపటికి: ‘కాని నా ఒంటి మీద బట్టలు తొలిగిపోతాయి. ఇవి తొలిగిపోకుండా ఉండేందుకు (అయినా) అల్లాహ్‌ను ప్రార్థించండి’ అని అన్నది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ ప్రకారం ఆమె కోసం ప్రార్థన చేశారు. [2]

---

[1] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2756).

[2] (బఖారీ:5220, ముస్లిం:4673 ).

https://teluguislam.net



## పేదవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్‌కు భయపడుతూ నిరపేక్షాభావంతో, గుట్టుగా జీవితం గడిపే మనిషిని అల్లాహ్ ప్రేమిస్తాడు.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హు) గారు చెప్తుండగా విన్నాననీ – హజ్రత్ అబ్దుర్ రహ్మాన్ బిన్ అల్ హుబులియ్యు (రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు:

**ఒక వ్యక్తి వచ్చి:** ''మనం ముహాజిరీన్ల (వలసవచ్చినవారు)కు చెందిన పేదవారము కామా?' అని అడిగాడు.

**తరువాత అబ్దుల్లాహ్ అతనితో:** ''నీ కొరకు ఒక భార్య ఉందా? దాని వద్దకు నీవు పోతుంటావు'' అని అడిగారు.

**దానికాయన:** 'అవును' అని అన్నారు.

**తరువాత:** 'నీ కొరకు నివసించుటకై ఒక నివాసం ఉందా?' అని అడిగారు.

**దానికాయన:** 'అవును' అని అన్నారు.

**తరువాత ఆయన: అయితే** 'నీవు ధనవంతుడివి' అని అన్నారు.

**ఆ తరువాత అతను:** 'నా వద్ద ఒక పని మనిషి కూడా ఉన్నాడు' అని తెలియజేశారు.

**అయితే:** 'నీవు రాజులలో ఒక రాజువి' అని ఆయన అన్నారు.[2]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హు) దగ్గరకు ముగ్గురు వ్యక్తులు నేను అక్కడుండగానే వచ్చారు.

---

[1] (ముస్లిం:5266).

[2] (ముస్లిం:5290).

https://teluguislam.net



**వారు:** యా అబా ముహమ్మద్! అల్లాహ్ సాక్షిగా! ‘మా దగ్గర ఎలాంటి వసతి లేదు, ఖర్చులకు డబ్బుగానీ, లేదా సవారిగానీ, లేదా (జీవన మనుగడకై కావలసిన) వస్తువులుగాని లేవు’ అని అన్నారు.

**ఆయన వారితో:** ‘మీకేంకావాలి? అని అడిగారు.

‘మీకేమైన కావాలంటే తిరిగి నా దగ్గరకు రండి, అల్లాహ్ నాకు అనుగ్రహించిన దానిలో మీకు ఏమైనా ఇస్తాను.’

**లేదా!** ‘మీ పరిస్థతి గురించి రాజు గారి దగ్గర వివరిస్తాను.’

**లేదా!** ‘మీరు సహనంతో (జీవితం) గడపండి.’ ఎందుకంటే?

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా నేను ఇలా విన్నాను: ‘‘నిశ్చయంగా ప్రళయ దినాన ముహాజిరీన్‌కు చెందిన నిరుపేదలు ధనవంతులకన్నా నలభై సంవత్సరాల ముందే స్వర్గంలోకి చేరుకుంటారు’’ అని అన్నారు.

ఆ మాట విన్న తరువాత వారు: ‘అయితే మేమంతా సహనాన్ని పాటిస్తాము, ఏ సహాయము మేము వేడుకోము’ అని అన్నారు. [1]

హజ్రత్ అబుల్ అబ్బాస్ సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఒక వ్యక్తి వచ్చి, **‘‘యా రసూలల్లాహ్!** అల్లాహ్ మరియు ప్రజలు నన్ను ప్రేమించాలంటే ఏం చెయ్యాలో చెప్పండి?’’ అని అడిగాడు.

అందుకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **‘‘లోకంపట్ల అనాసక్తత చూపు. అల్లాహ్ నిన్ను ప్రేమిస్తాడు’’**

---

[1] (ముస్లిం: 5291).

https://teluguislam.net



ఆ తర్వాత: **''ప్రజల దగ్గర ఉన్నవాటి పట్ల అనాసక్తత కనబరచు. అప్పుడు ప్రజలు నిన్ను అభిమానిస్తారు''** అని సమాధానమిచ్చారు. [1]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''నేను స్వర్గ ద్వారంలో నించొని చూసాను. స్వర్గంలో ప్రవేశించేవారిలో చాలామంది అభాగ్యులే (పేదవారే) కనిపించారు. ధనవంతులు (స్వర్గంలో ప్రవేశించలేక) ఆగిపోతున్నారు. (అంతలో) నరకవాసుల్ని నరకానికి తీసుకెళ్ళమని ఆదేశమయింది...'' [2]

హజ్రత్ సఅద్ బిన్ అస్సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర నుంచి ఒక వ్యక్తి పోసాగాడు.

అంతలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులతో: 'ఈ వ్యక్తి గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగారు.

దానికి ప్రవక్త గారి అనుచరులు: 'మా అభిప్రాయం ప్రకారం ఇతను గొప్ప వ్యక్తులలో ఒక వ్యక్తి, ఒక అజాద్ వ్యక్తి, మరియు అతను ఎవరికైనా పెళ్ళికి అహ్వానం చేస్తే, అతని ఆహ్వానాన్ని అంగీకరిస్తారు. అతను ఎవరికైన సిఫారసు చేస్తే అతని సిఫారసు అంగీకరిస్తారు. అతను మాట్లాడితే అతని మాటను (శ్రద్ధగా) వింటారు' అని అన్నారు.

ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమనలేదు. తరువాత మరొక వ్యక్తి అక్కడి నుండి పో సాగాడు.

---

[1] (ఇబ్నుమాజా: 4102, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 3213).

[2] (బుఖారీ:4797, ముస్లిం:4919).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులతో: 'ఈ వ్యక్తి గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగారు.

దానికి ప్రవక్త గారి అనుచరులు: 'మా అభిప్రాయం ప్రకారం ఇతను పేదవారికి చెందిన ఒక ముస్లిం. ఒక అజాద్ వ్యక్తి. అతను ఎవరికైనా పెళ్ళికి అహ్వానం చేస్తే, అతని ఆహ్వానాన్ని అంగీకరించరు. అతను ఎవరికైన సిఫారసు చేస్తే అతని సిఫారసు అంగీకరించరు. అతను మాట్లాడితే అతని మాటను (శ్రద్ధగా) వినరు' అని అన్నారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **''ఈ వ్యక్తి వారి (ధనవంతుల) కంటే ఎంతో మేలైనవాడు. అలాంటివారు (ధనవంతులు) భూమండాలానికి సమానమైన సరే''** అని అన్నారు.[1]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: మృతుని వెంట మూడు వస్తువులు (సమాధి దగ్గరికి) వెళతాయి.

**ఒకటి:** అతని కుటుంబీకులు.

**రెండు:** అతని సంపద.

**మూడు:** అతని కర్మలు.

''రెండు వస్తువులు వెనక్కి తిరిగి వస్తాయి, ఒకటి మాత్రం అక్కడే ఉండిపోతుంది.''

**''కుటుంబీకులు, సంపద తిరిగి వస్తాయి. కాని కర్మలు మాత్రం అతని వెంటే ఉంటాయి.''**[2]

[1] (సహీహ్ ఇబ్ను మాజా: 4120).
[2] (బుఖారీ:6033, ముస్లిం:5260).

https://teluguislam.net



హజ్రత్ ఖతాద బిన్ నౌమాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఎప్పుడైతే అల్లాహ్ ఒక వ్యక్తిని ప్రేమిస్తాడో అప్పుడు అతనికి ప్రపంచ ఐశర్యం (ధనం, హోదాలు) ఇవ్వడం తగ్గించేస్తాడు. ఎలాగైతే ఒక డాక్టరు చికిత్స నిమిత్తం (రోగికి) నీళ్ళను త్రాపించడం తగ్గిస్తాడో.'' [1]

అంటే; డాక్టరు ఒక రోగికి నీరు హాని చేస్తుందని గ్రహించినప్పుడు పత్యంగా ఆ రోగికి నీళ్ళు ఇవ్వకుండా అతనికి మేలు చేస్తాడు. అలాగే అల్లాహ్ కూడా మనిషికి ఐశర్వం, ధనం, హోదాలు తగ్గించి అతనికి పాపాల నుండి రక్షించుటకై పేదవానిగా చేసి, దౌర్జన్యాలకు, అహంకారాలకు పాల్పడే హోదాలు కట్టబెట్టకుండా అతనికి మేలు చేస్తాడు. మరియు పుణ్యమైన జీవితాన్ని గడుపుటకు అవసరమైన ఉపాధిని మాత్రమే ప్రసాదిస్తాడు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా ప్రవచించారు: **''పేదవారు ధనవంతులకన్నా ఐదొందల సంవత్సరాల ముందే స్వర్గంలోకి ప్రవేశిస్తారు.''** (ప్రళయం దినంలో) అది సగ దినమవుతుంది. [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసికి ప్రపంచం చెరసాల (జైలు) వంటిది. అవిశ్వాసికి ఇది స్వర్గం వంటిది.'' [3]

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2036, సహీహ్ అల్‌జామే: 282).

[2] (సహీహ్ తిర్మిజీ: 2353).

[3] (ముస్లిం:5256).

https://teluguislam.net



హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ‘‘ఓ అల్లాహ్! అసలు జీవితమంటే పరలోక జీవితమే (భోగభాగ్యాల జీవితం) అని అన్నారు.’’ [1]

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: ‘పేదవారిని అభిమానించండి!’ ఎందుకంటే?

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దుఆ చేస్తుండగా నేను ఇలా విన్నాను :ఓ అల్లాహ్! ‘నన్ను పేదవానిగా బ్రతకనివ్వు, పేదరికంలోనే నాకు మరణాన్ని ప్రసాదించు, (మరణానంతరం) పేదవారి సమూహంలోనే నన్ను లేపు’... అని అన్నారు. [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఈ సంపద మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతి ఫలానికి ఉత్తమమ్మైనవి మరియు దానిని ఆశించటానికి కూడా ఉత్తమమ్మైనవి.’’[3]

**సత్కార్యాలంటే? మంచి పనులు:** అల్లాహ్ మనపై ధర్మపరంగా నియమించిన విధులు (ఫరాయిజ్), వాజిబాత్‌లు, ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయాలు (సునన్).

మరియు అదనం (నవాఫిల్)గా చేసే మంచి పనులు ఇంతే గాకుండా నిషేధింపబడిన వాటి నుండి దూరంగా ఉండటం కూడా సత్కార్యాల పరధిలోకే లెక్కింపబడుతాయి.

---

[1] (బుఖారీ:2622, ముస్లిం:3368).
[2] (తిర్మిజీ:2352, ఇబ్నుమాజా: 4126).
[3] (సూరతుల్ కహఫ్: 46).

https://teluguislam.net



## సత్యవంతులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

సత్యం అంటే? జరిగిన వాస్తవికతను ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా తెలుపడం. ఉదాహరణకు: ఈ రోజు ఆదివారం ఉంటే, దానిని ఆదివారం అనే చెప్పాలి. ఒక వేళ సోమవారము అంటే అది అసత్యమైన మాట. సత్యానికి విరుద్ధంగా అబద్ధం పలికినట్లు.

ఏ మాట పలుకుతామో దానికి అనుగుణంగా మన కర్తవ్యం కూడా ఉంటే దాన్ని సత్యంగా భావిస్తాము. ఇంకా, ఒక వ్యక్తి తన నోటితో ఏదైతే పలుకుతాడో, ఆ మాట మేరకే అతని మనసులో కూడ ఉండాలి. మరియు ఏ పని చేస్తామో, ఆ పని గురించి తమ మనసుకు పూర్తిగా ఇష్టమై ఉండాలి. ఇలాంటి వాటినే సత్యము, నిజము, వాస్తవము అని అంటాము.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం ప్రయోజనకరమవుతుంది. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలు ప్రాప్తిస్తాయి. అందులో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు, వాస్తవానికి సాఫల్యం అంటే ఇదే.’’ [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నిశ్చయంగా సత్యం మంచికి మార్గం చూపుతుంది, మరియు మంచి స్వర్గానికి మార్గం చూపుతుంది, అలాగే ఆ వ్యక్తి సత్యమే పలుకేవాడుంటే చివరకు అల్లాహ్ వద్ద అతని పేరు సత్యసంధుడు అని వ్రాయబడుతుంది. మరియు అసత్యాలు పాపాలకు దారి చూపుతాయి. పాపాలు నరకానికి

[1] (5,సూరతుల్ మాయిదా: 119).

https://teluguislam.net



దారి చూపుతాయి. అలాగే ఆ వ్యక్తి అసత్యాలు పలుకుతూంటే చివరకూ అల్లాహ్ వద్ద అతని పేరు అసత్యవాది అని వ్రాయబడుతుంది.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ...''వ్యాపారస్తులు తమ వ్యాపారంలో సత్యమైన బాటను పాటించి, (ఆ సామాగ్రి మంచి చెడులను గురించి) విడమర్చి చెప్పి వ్యాపారం చేస్తే వారి వ్యాపారంలో అల్లాహ్ శుభాలను ప్రసాదిస్తాడు.'' [2]

మనం అనవసరమైన మాటలు మాట్లాడకూడదు అవి నిజమేనైతే తప్ప. ఎందుకంటే? ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌ను మరియు ప్రళయదినాన్ని విశ్వసిస్తున్నారో, వారు సత్యమే పలకండి, లేదంటే మాట్లాడకుండా ఉండండి.'' [3]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతుల వెంట ఉండండి.'' [4]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్తుండగా హజ్రత్ ఉమ్మే కుల్సూమ్ (రజియల్లాహు అన్హ) విన్నారనీ ఇలా తెలియజేశారు: ''అబద్ధాలను ప్రజల వ్యవహారాలను సరిదిద్దుటకై చెప్పేవాడు అసత్యవాది కాడు. దాని వలన అతను మేలును కాంక్షిస్తున్నాడు, లేక మేలు కొరకై చెప్తున్నాడు.'' [5]

---

[1] (బుఖారీ:5629, ముస్లిం:4719).
[2] (బుఖారీ:1937, ముస్లిం:2825).
[3] (బుఖారీ:5994, ముస్లిం:67).
[4] (9,సూరతుతౌబా:119).
[5] (బుఖారీ:2495, ముస్లిం:4717).

https://teluguislam.net



## న్యాయమూర్తులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

నిత్యం న్యాయం చేయండి. ఎందుకంటే న్యాయం చేసేవారిని అల్లాహ్ ఎంతగానో ఇష్టపడుతాడు. న్యాయం చేసేవారికి ఆయన గొప్ప బహుమానం ఇస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''న్యాయం చేయండి నిశ్చయంగా అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా న్యాయానికి కట్టుబడి ఉండేవారు కరుణామయుని (అల్లాహ్) సన్నిధిలో కుడివైపు కాంతితో నిండిన వేదికలపై ఉంటారు...'' [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఇహలోకంలో న్యాయానికి కట్టుబడి ఉండేవారు పరలోకంలో కరుణామయుని (అల్లాహ్) ముందర ముత్యాల వేదికలపై ఉంటారు. వారు ఇహలోకంలో న్యాయాన్ని నిలబెట్టినందుకు.'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఇయాజ్ బిన్ హిమార్ (రజియల్లాహు అన్హు) తెలియజేశారు: ముగ్గురు (గుణవంతులు) స్వర్గవాసులవుతారు.

1) న్యాయంగా పరిపాలించే, సదాచరణ చేసే భాగ్యం కలిగిన రాజు.

---

[1] (సూరతుల్ హుజురాత్:9).

[2] (ముస్లిం:3406).

[3] (అల్ మెస్తదరక్ లిల్‌హాకిమ్: 7106, అహ్మద్: 6197).

https://teluguislam.net



2) దగ్గరి బంధువుల పట్ల, ఇతర ముస్లిముల పట్ల జాలి, దయా కలిగిన హృదయంతో ఉన్న వ్యక్తి.

3) పేదవాడైనప్పటికీ ఆత్మాభిమానం కారణంగా ఎవరి ముందర చేయి చాచని వ్యక్తి...[1]

మనిషి నిత్యం న్యాయానికి, ధర్మానికి కట్టుబడి ఉండాలి. అంటే మీ మనోవాంఛ, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, వర్గ దురాభిమానం, రాగద్వేషాలు మిమ్మల్ని న్యాయం, ధర్మాల విషయంలో గుడ్డివారిగా చేయరాదు. న్యాయం విషయంలో అల్లాహ్‌కు భయపడాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''న్యాయం చే యండి. ఇది దైవభీతికి అత్యంత చేరువైనది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండీ. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుస్తూనే ఉంటాయి.''[2]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఏ రోజు అల్లాహ్ నీడ తప్ప వేరే నీడ లభ్యం కాదో ఆ రోజు అల్లాహ్ ఏడు రకాల మనుషులకు తన నీడలో ఆశ్రయమిస్తాడు.''

1) న్యాయశీలుడైన పాలకునికి.

2) తన జీవితాన్ని అల్లాహ్ ఆరాధన మరియు విధేయతలో గడిపిన యువకునికి.

3) మసీదులోనే తన మనసును లగ్నం చేసుకున్న వ్యక్తికి. (అతను మసీదు నుండి వెలుపలికి రాగానే మళ్ళీ మసీదులోకి ఎప్పుడు తిరిగి పోతానా అని నిరీక్షిస్తూ ఉంటాడు).

---

[1] (ముస్లిం: 5109).

[2] (సూరతుల్ మాయిదా: 8).

https://teluguislam.net



4) అల్లాహ్ ప్రేమ కొరకు మాత్రమే స్నేహబంధాలను కోరుకునే ఇద్దరు వ్యక్తులు. అలాగే వారిద్దరూ అల్లాహ్ ప్రేమ కొరకు మాత్రమే విడిపోతారు.

5) ఉన్నత వంశీయురాలైన స్త్రీ చెడుపనికి ఆహ్వానిస్తే కేవలం అతను అల్లాహ్‌కు భయపడుతూ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించిన వ్యక్తికి.

6) రహస్యంగా దాన ధర్మాలు చేసిన వ్యక్తికి. అతను కుడి చేత్తో చేసిన దానం ఎడమ చేయికి తెలియదు.

7) ఏకాంతంలో అల్లాహ్‌ను ధ్యానిస్తూ ఉండగా అతని కళ్ళారా కన్నీరు కార్చే వ్యక్తికి అని తెలిపారు. [1]

## భయభక్తిగా జీవించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

భయభక్తులను కలిగి ఉండటం అంటే అల్లాహ్ నిషేధించిన విషయాల జోలికి పోకుండా ఉండటం. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆచరించమని చెప్పినవాటిని ఆచరించటం. ఇలాంటి సజ్జనులు అల్లాహ్ ప్రీతికి అర్హులవుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘వాస్తవానికి, ఎవడు తన ఒప్పందాన్ని పూర్తిచేసి భయభక్తులు కలిగి ఉంటాడో, అలాంటి భయభక్తులు గలవారిని నిశ్చయంగా అల్లాహ్ ప్రేమిస్తాడు.’’ [2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **‘‘వల్లాహు వలియ్యుల్ ముత్తఖీన్’’** (మరియు అల్లాహ్ దైవభీతి కలవారికి సన్నిహితుడు). [3]

---

[1] (బుఖారీ:620, ముస్లిం:1712).

[2] (సూరతు ఆల ఇమ్రాన్:76).

[3] (సూరతుల్ జాసియా:19).

https://teluguislam.net



ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఆ రోజు మేము భయభక్తి గలవారిని అనంత కరుణామయుని సన్నిధిలో అతిథులుగా ప్రవేశపెడతాము.’’ [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో అల్లాహ్‌కు భయపడుతూ ఆయన (శిక్షల) నుండి తమను కాపాడుకుంటారో వారే విజయం సాధించేవారు.’’[2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పరుగెత్తండి. దాని వెడల్పు భూమ్యాకాశాలంత ఉంటుంది. అది భయభక్తులు గలవారి కోసం తయారు చేయబడింది.’’ [3]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నిశ్చయంగా దైవభీతి పరాయణులు సురక్షిత (ప్రశాంత) స్థలంలో ఉంటారు.–ఉద్యానవన చెలమల మధ్యన..– పల్చటి సిల్కు వస్త్రాలను, దళసరి పట్టు వస్త్రాలను ధరించి ఎదురెదురుగా ఆసీనులై ఉంటారు. (భక్తిపరాయణుల పట్ల) ఇలాగే వ్యవహరించబడుతుంది. (హూరు) అందగత్తెలతో మేము వారి వివాహం జరిపిస్తాము. వారక్కడ నిక్షేపంగా (కూర్చొని) అన్ని రకాల పండ్లు ఫలాదులను తెప్పించుకుంటూ ఉంటారు. – మొదటిసారి వచ్చిన మరణం తప్ప, మరింకా వారు అక్కడ మరణం రుచి చూడటమనేదే ఉండదు. నరకాగ్ని శిక్ష నుండి అల్లాహ్ వారిని రక్షించాడు ఇది కేవలం నీ ప్రభువు కృప మాత్రమే. చాలా గొప్ప విజయమంటే ఇదే.’’ [4]

---

[1] (సూరతు మర్యమ్: 85).
[2] (సూరతున్ నూర్:52).
[3] (సూరతు అల ఇమ్రాన్: 133).
[4] (సూరతు దుఖాన్: 51–57).

https://teluguislam.net



మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వినండి! అల్లాహ్ స్నేహితులకు భయముగాని, దుఃఖంగానీ ఉండదు-వారు విశ్వసించినవారై (చెడుల విషయంలో) అల్లాహ్‌కు భయపడేవారై ఉంటారు.''[1]

హ॥జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌కు భయపడుతూ కన్నీరు కార్చారో వారు నరకానికి ప్రవేశించరు. ఎప్పటివరకైతే పాలు పొదుగులోకి తిరిగి పోదో!''...[2]

## పరిశుద్ధులను అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ పశ్చాత్తాపపడే వారిని, పారిశుద్ధ్యాన్ని అవలంభించేవారిని ఇష్టపడుతాడు.''[3]

మరియు ఇలా తెలియజేశాడు: ''బాగా పరిశుద్ధతను పొందటాన్ని ఇష్టపడేవారు అందులో (మస్జిదే ఖుబాలో) ఉన్నారు. బాగా పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.'' (సూరతు తౌబా:108).

పరిశుద్ధతను బాగా పాటించే ఈ సజ్జనులు ఎవరు? వారు ఖుబా వాసులని హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

''అల్లాహ్ మీ శుచీ శుభ్రతలను కొనియాడాడు, ఇంతకీ మీరు ఏం చేస్తారు?'' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వాళ్లను ఒకసారి దర్యాప్తు చేయగా, ''మేము మట్టి పెడ్డలను ఉపయోగించటంతో పాటు, నీరును కూడా ఉపయోగిస్తాం'' అని వారు వివరించారు.[4]

---

[1] (సూరతు యూనుస్:62-63).

[2] (సహీహ్ తిర్మిజి: 1632, సహీహ్ నసాయి:3108, అహ్మద్:10156).

[3] (సూరతుల్ బఖరా: 222).

[4] (ఇబ్నె కసీర్, అహ్సనుల్ బయాన్ తెలుగు:880).

https://teluguislam.net



హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మిస్వాక్ ద్వారా నోరు శుభ్రమవుతుంది. మరియు ప్రభువు (అల్లాహ్) ప్రసన్నత లభిస్తుంది.''[1]

అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక హదీసులో ఇలా ఆదేశించారు: ''నా అనుచర సమాజం లేక ప్రజలు ఇబ్బందికి లోనవుతారనే భయం గనక నాకు లేకపోయినట్లయితే నేను వారిని ప్రతి నమాజు సమయంలోనూ మిస్వాక్ చేయాలని ఆదేశించేవాణ్ణి.''[2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: పది విషయాలు మానవ సహజమైనవి.

1) మీసాలు కత్తిరించటం.

2) గడ్డం పెంచటం.

3) పల్లు తోముకోవటం.

4) ముక్కుని నీటితో శుభ్రం చేసుకోవటం.

5) గోళ్లు కత్తిరించుకోవటం

6) వ్రేళ్ళ మధ్య భాగాన్ని కడుక్కోవటం.

7) చంకలోని వెంట్రుకల్ని తొలగించటం.

8) నాభి క్రింద వెంట్రుకల్ని తీసి వేయటం.

9) మూత్రశుద్ధి నీటితో చేసుకోవటం. ఆ తర్వాత ఉల్లేఖకుడు ఇలా అంటున్నాడు –పదో విషయం నేను మర్చిపోయాను. బహుశా అది

10) 'పుక్కిలించటం' కావచ్చని నా అభిప్రాయం.[3]

---

[1] (నసాయి:5, ఇబ్ను ఖుజైమా:1074, అహ్మద్:7).

[2] (బుఖారీ:838, ముస్లిం:370).

[3] (ముస్లిం:384).

https://teluguislam.net



## తుమ్ముల కారణంగా ప్రేమింపబడతారు:

ఇస్లామీయ షరీఅత్ ప్రకారం అనేక ఆచారాల గురించి వ్యవహారాల గురించి ఉత్తమమైన సుగుణాల గురించి వివిధమైన నియమాలు నేర్పబడ్డాయి. అందువలన ఇక్కడ మేము తుమ్ముల విశిష్ఠత గురించి తెలుసుకుందాము. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నిశ్చయంగా అల్లాహ్ తుమ్ములను ఇష్టపడుతాడు, కాని ఆవలింతలు అల్లాహ్‌కు అయిష్ఠమైనవి…’’ [1]

**ఇమామ్ అల్ ఖుర్తుబీ (రహ) ఇలా తెలియజేశారు:**

‘‘ఆవలింతలు వచ్చే సమయంలో మేము వాటిని (ప్రభావాన్ని) తగ్గించుకోకపోతే షైతాన్ నవ్వుతాడు, మరియు నోటిలోకి పోతాడు. మరియు కొందరు ఇలా అన్నారు: షైతాన్ వారి నోటిలో కక్కుతాడు.’’

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘అల్లాహ్ తుమ్ములను ఇష్టపడుతాడు, ఆవలింతను అయిష్టపడుతాడు, మీరు తుమ్మినప్పుడు ‘అల్‌హమ్దులిల్లాహ్’ అనాలి. దానిని విన్న ప్రతి ముస్లిం తుమ్మినవారికి విధిగా జవాబు ఇవ్వాలి.’’ [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తుమ్మినప్పుడు: **‘అల్‌హమ్దులిల్లాహ్’** అని చెప్పేవారు.

ఆయనకు బదులుగా **‘యర్‌హముకల్లాహ్’** అని అనేవారు.

---

[1] (బుఖారీ:5755).

[2] (బుఖారీ:5755, ముస్లిం:4023).

https://teluguislam.net



తరువాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) **'యహ్‌దీకుముల్లాహు వ యుస్‌లిహ్ బాలకుమ్'** అని తిరిగి చెప్పేవారు. [1]

హజ్రత్ ఇబ్ను ఉసైమీన్ (రహ) ఇలా తెలియజేశారు: అల్లాహ్ తుమ్ములను ఎందుకు ఇష్టపడుతాడంటే? 'తుమ్మిన వ్యక్తి బాగా హుషారుగా ఉంటాడు. మరియు అల్లాహ్ హుషారుగా ఉన్న వ్యక్తిని ఇష్టపడుతాడు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''శక్తి మంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికంటే మేలైనవాడు. మరియు అల్లాహ్‌కు ఎంతగానో ఇష్టమైనవాడు, ప్రతి ఒక్కరిలోను మేలు ఉంటుంది. మీకు ప్రయోజనం చేకూర్చే దాని కోసమే అశపడండి...'' [2]

ఒక వ్యక్తికి తుమ్ములు వచ్చాయంటే అతను ఎంతగానో చురుకుగా హుషారుగా ఉన్నాడని అర్థం. అందుకనే తుమ్ములంటే అల్లాహ్‌కు ఇష్టమైనవి. తుమ్మిన వ్యక్తి **'అల్‌హమ్దులిల్లాహ్'** అని అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు తున్నాడు. అల్లాహ్‌ను కృతజ్ఞతలు చెల్లించేవాళ్ళే ప్రియమైన దాసులు.

## బిడియం (సిగ్గు) స్వర్గానికి మార్గం:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సిగ్గు విశ్వాసానికి చెందిన అంశం, మరియు విశ్వాసం వలన స్వర్గం లభ్యమౌతుంది, అశ్లీలమైన (సిగ్గుమాలిన) సంభాషణ దుష్ట వ్యవహారమవుతుంది. దుష్ట వ్యవహారం వలన నరకం లభ్యమవుతుంది.'' [3]

---

[1] (అహ్మద్: 1657, సిల్‌సిలతుస్ సహీహా: 2387).

[2] (ముస్లిం:4816).

[3] (సహీహ్ తిర్మిజి: 2009, సహీహ్ ఇబ్ను మాజా:4184, సహీహుల్ జామే:5510).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘సిగ్గు చెందటం మరియు నోటిని అదుపు చేయడం విశ్వాసానికి చెందిన రెండు భాగాలు, సిగ్గుమాలిన సంభాషణ మరియు అతిగా మాట్లాడటం వంచనకు చెందిన భాగాలు.’’ [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక సారి: ‘‘అల్లాహ్ ఎడల లజ్జగా మెలగండి. సిగ్గుపడవలసిన రీతిలోనే ఆయన ఎదుట సిగ్గుపడండి’’ అని అన్నారు.

**దానికి అక్కడున్న వారు:** ‘‘దైవప్రవక్తా! అల్లాహ్ కృపవల్ల మేము అల్లాహ్ ఎడల లజ్జా పూరితంగానే మెలుగుతున్నాము.’’ అని బదులు పలికారు.

**అప్పుడు ఆయన ఇలా బోధించారు:** అదికాదు, ‘‘అల్లాహ్ ఎడల సిగ్గుపడవలసిన రీతిలో  సిగ్గుపడటమంటే మీరు మీ మస్తిష్కాన్ని, అందులో ఉత్పన్నమయ్యే ఆలోచనలను అదుపులో పెట్టుకోవాలి. కడుపును, అందులో వేసుకునే భుక్తిని కనిపెట్టుకుంటూ ఉండాలి.

మృత్యువును, దాని పర్యవసానం కుళ్ళి, కృషించి అంతమయి పోవడాన్నీ జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి.

ఏ వ్యక్తి పరలోక సాఫల్యాన్ని కోరుకుంటాడో అతడు ప్రాపంచిక ఆడంబరాలను త్యజిస్తాడు. ప్రపంచానికి బదులు పరలోకానికి ప్రాముఖ్యంనిస్తాడు. ఇలా ఆచరించిన వ్యక్తే వాస్తవానికి అల్లాహ్ పట్ల సిగ్గుపడవలసిన రీతిలో సిగ్గుపడినవాడు.’’ [2]

---

[1] (సహీహ్ తిర్మిజి: 2027, సహీహుల్ జామే:5512, అహ్మద్:21280).

[2] (తిర్మిజీ, హదీస్ హసన్:1724, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్:1724).

https://teluguislam.net



హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పరదా ధరించే కన్యకన్న ఎక్కువగా సిగ్గుపడేవారు. "ఒక వేళ ఆయన చిరాకు కలిగే విషయాన్ని చూసారంటే అది ఆయన ముఖంలో వెంటనే కనపడుతుంది." [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"సిగ్గు విశ్వాసానికి చెందిన ఒక భాగం నా జాతిలో అతి ఎక్కువ లజ్జ గల వ్యక్తి హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు)" అని తెలిపారు. [2]

---

[1] (బుఖారీ5637, ముస్లిం:4284).

[2] (సిల్‌సిలతుస్ సహీహా: 1828).